# కూల్చివేతలు అన్యాయం

- ఇళ్ల ధ్వంసంపై వివేకానందనగర్ బస్తీవాసుల ఆవేదన
- సంఘీభావం తెలిపిన దళిత సంఘాలు



బస్తీవాసులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**చిక్కడపల్లి:** తమ ఇళ్లను అన్యాయంగా కూల్చివేశారని.. ప్రత్యామ్నాయం చూపే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ స్వామి వివేకానందనగర్ బస్తీ వాసులు తెగేసి చెప్పారు. సోమవారం ఉదయం బస్తీలో కూల్చివేతలు జరిగిన అనంతరం అరెస్టయిన బాధితులు తిరిగి అదే రోజు రాత్రి బస్తీకి చేరుకున్నారు. అక్కడే మకాం వేసి వంటలు వండుకున్నారు. తమకు షెల్టర్ లేకుండా చేశారని.. పునరావాసం కల్పించే వరకు ఇక్కడే ఉంటామని బాధితులు చెప్పారు. తమ బస్తీ ఏర్పడిన తర్వాత నిర్మించుకున్న అపార్ట్‌మెంట్ వాళ్లకు మద్దతుగా నిలిచిన అధికారులు తమ ఇళ్లను కూల్చి వేశారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వుల పేరుతో 70 సంవత్సరాల నుంచి నివాసముంటున్న తమను రోడ్డుపై పడేయడం ఎంత వరకు న్యాయమని బాధితులు ప్రశ్నిస్తున్నారు.



తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

**న్యాయం జరిగే వరకు పోరాటం..**

స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ తెలిపారు. బస్తీ వాసులకు యుద్ధ ప్రాతిపదికన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని కోరుతూ మంగళవారం ముషీరాబాద్ తహసీల్దార్ వెంకటలక్ష్మిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వారం రోజుల్లో బస్తీవాసులకు ప్రత్యామ్నాయం చూపించడం లేదంటే డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించే విషయంలో సానుకూల చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాల ఇళ్లు కూల్చి వేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వానికి పూర్తి వివరాలతో నివేదిక సమర్పిస్తామని.. ప్రత్యామ్నాయం చూపే విషయం ప్రభుత్వం చేతిలో ఉందని తహసీల్దార్ చెప్పారన్నారు. ఇదిలా ఉండగా, కూల్చి వేసిన చోటే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు పి.శంకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు నవీన్‌రాజ్, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి గజ్జల రాజశేఖర్ మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్వామి వివేకానందనగర్ బస్తీ వాసులను పరామర్శించి తమ సంఘీభావం తెలిపారు.



ఇళ్లు కూల్చి వేసిన స్థలంలోనే బస్తీవాసులు

## కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జగదీశ్‌బాబు

**చిక్కడపల్లి:** కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండు జగదీశ్‌బాబు మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

## జాతిపితకు నివాళి



**నల్లకుంట:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహబస్తీలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముషీరాబాద్ డివిజన్‌లో...



**ముషీరాబాద్:** భారత జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి ముషీరాబాద్ డివిజన్ బాపూజీ నగర్‌లో బాపూజీ విగ్రహం వద్ద ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, కాడబోయిన బాబురావు, టెంట్‌హౌస్ శ్రీను, శివ ముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు, భిక్షపతి యాదవ్, సదా ముదిరాజ్, వెంకటేశ్, భాస్కర్, గోవింద్, సహదేవ్, గోరఖ్‌నాథ్, రాజు పాల్గొన్నారు.

## గౌతమ్‌రావుకు సన్మానం

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన గౌతమ్‌రావును కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, తెలంగాణ జానపద కళాకారుల గౌరవ అధ్యక్షురాలు కళాబంధు డాక్టర్ జి.అనూహ్యారెడ్డి, చినుకు కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పి.ఎస్.మూర్తి మంగళవారం బాగ్‌లింగంపల్లిలో సన్మానించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ.. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాట్య గురువులు అనుదీప్తి, రమణి సిద్ధి, కె.రమాదేవి, రామలక్ష్మి, లావణ్య, రజిత ఉన్నారు.

## రచయిత్రులకు పురస్కారాలు



**చిక్కడపల్లి:** తెలుగు రచయిత్రులు వేరే భాషా రచయిత్రులకు ఏమాత్రం తీసిపోరని ప్రఖ్యాత రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి అన్నారు. వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో వంశీ లేఖిని జాతీయ సాహితీ పురస్కారాలు అందించారు. ముఖ్య అతిథిగా విజయలక్ష్మి పాల్గొని ఇల్లిందల సరస్వతి, భానుమతి, ద్వివేదుల విశాలక్షి, మాదిరెడ్డి సులోచన, డాక్టర్ ఆనందరామం, ఆరికపూడి కౌసల్యాదేవి, యుద్ధనపూడి సులోనారాణి పేరిట అవార్డులను ఆచార్య సుమతీ నరేంద్ర, వి.నాగలక్ష్మి, కామేశ్వమిర, గౌరీలక్ష్మి, గంటి భానుమతి, జయశ్యామల, జీహెచ్‌లక్ష్మికు అందజేశారు.

## 'దళిత విభాగం' ఉపాధ్యక్షుడిగా రమేశ్‌బాబు



**ముషీరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ దళిత విభాగం అధ్యక్షుడిగా ఉన్న అచ్చుత్ రమేశ్‌బాబును తెలంగాణ రాష్ట్ర దళిత విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడి నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దళిత విభాగ అధ్యక్షుడు రాజేశ్ లలోతియా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఎస్సీ, బీసీ, మైనార్టీ విభాగాల కోఆర్డినేటర్ కొప్పుల రాజు సంయుక్తంగా నియామకపత్రాన్ని రమేశ్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర దళిత విభాగ అధ్యక్షుడు నగరిగారి ప్రీతమ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షికు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## 'రచయితల సంఘం' ఉపాధ్యక్షుడిగా రామ్మోహన్‌రెడ్డి



గుర్రం రామ్మోహన్‌రెడ్డి

**కాచిగూడ:** అభ్యుదయ రచయితల సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా గుర్రం రామ్మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సృజనాత్మక సాహిత్యంతో పాటు మరిన్ని పాటలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత సమకాలీన సమాజంపై విలువలు లేని సాహిత్యం బలమైన ముద్ర వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో నూతన సాహిత్యం రావాల్సిన అవసరం ఉందన్నారు.

# డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

**కాచిగూడ:** రూ.9 లక్షల వ్యయంతో గోల్నాక డివిజన్, కామ్‌గార్‌నగర్ బస్తీలో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించారు. బస్తీలో డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగు పరచాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం కామ్‌గార్‌నగర్ బస్తీలో ఉన్న బస్తీ దవాఖానును ఎమ్మెల్యే పరిశీలించారు. ఇక్కడి వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానాలో వైద్య పరీక్షలతో పాటు మందులను ఉచితంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. బస్తీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్‌పై ఫ్లోర్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈక్రమంలో ప్రజల నీటి ఎద్దడిని తీర్చడానికి త్వరలోనే బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట జలమండలి, జీహెచ్‌ఎంసీ విభాగాల అధికారులు, సిబ్బంది, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు. మరోవైపు కామ్‌గార్‌నగర్ బస్తీలో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. బస్తీలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ఇళ్ల స్లాబులు, గోడలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టి తీసుకొచ్చారు. కామ్‌గార్‌నగర్ బస్తీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. గతంలోనే ఇక్కడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా కొన్ని కారణాలతో నిర్మాణాలు జరగలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



కామ్‌గార్‌నగర్ బస్తీలో డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

# 'బీసీ విద్యార్థి సేన' అధ్యక్షుడిగా రామకృష్ణ

**కాచిగూడ:** తెలంగాణ బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడిగా వేముల రామకృష్ణను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ధరలకు అనుగుణంగా విద్యార్థుల హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ పరిధిలో నూతనంగా హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం 100 ఎకరాలు కేటాయిస్తూ జారీ చేసిన జీఓ 55ను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తక్షణమే జీవోను వెనక్కి తీసుకోకపోతే ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని రామకృష్ణ హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బర్క కృష్ణ, టి.రాజ్‌కుమార్, నీలం వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



రామకృష్ణకు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

# త్యాగరాజ కీర్తనలు అజరామరం



కీర్తనలు ఆలపిస్తున్న శ్రీనివాస శర్మ బృందం

**నల్లకుంట:** త్యాగరాజ స్వామి కీర్తనలు అజరామరమని ప్రముఖ బుల్లితెర దర్శక, నిర్మాత శోభాశంకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో త్యాగరాజ స్వామి 177వ ఆరాధన ఉత్సవం, సరస్వతి సంగీత విద్యాలయం 68వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాశంకర్.. త్యాగరాజ స్వామి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ముందుగా వర్ధమాన గాయినీలు యశస్విని, తేజస్విని, రాగిణి, మనస్వినిచే ప్రార్థన గీతం ఆలపించారు. అనంతరం విద్యార్థులచే త్యాగరాజ అష్టోత్తర పూజ జరిగింది. సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో శిష్య బృందం ఆలపించిన పంచరత్న కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతా మూర్తి గానవాద్య కచేరి జరిగింది. ఈ అనంతరం సంగీత విద్యాలయం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. చివరిగా ప్రముఖ నర్తకి వాసుకీ దేవి ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

# 'ది గుడ్ ఫైట్' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** సీనియర్ జర్నలిస్టు ప్రబీర్ పుర్కాయస్తా రచించిన కీపింగ్ ఆఫ్(ది గుడ్ ఫైట్) పుస్తకాన్ని మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవస్థపై మితిమీరిన ప్రేమను పెంచుకోవడం వల్ల ప్రమాదం కూడా పెరిగిందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. సమకాలిన సమాజంలో మార్పు ఎలా వచ్చిందో తెలుసుకోవడానికి ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ.. నానాడు ప్రశ్నించిన వ్యక్తులను గౌరవిస్తే నేడు అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ప్రబీర్ అరెస్టు న్యాయసమ్మతమైంది కాదన్నారు. ప్రొఫెసర్ మాడభూసి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉండాలన్నారు. తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ ఎ.విద్యాసగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిస్టు తులసీచందు పాల్గొన్నారు.

# 'బీసీలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి'

**కాచిగూడ:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో నేతలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎంని కలిసి వినతిపత్రం అందించారు. కులగణన చేపట్టి పంచాయతీరాజ్ రిజర్వేషన్లను 42 శాతంకు పెంచాలని, విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 52 శాతంకు పెంచాలని ఈ సందర్భంగా సీఎంను కోరారు. బీసీలలో ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని, బీసీ బంధు ప్రవేశపెట్టి రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేయాలన కోరారు. ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థులకు ఇస్తున్న విధంగా బీసీ, ఈబీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్య స్టైఫండ్ స్కీమ్ కోసం బడ్జెట్‌ని రూ.300 కోట్లకు పెంచాలన్నారు. బీసీ గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణం కోసం రూ.400 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. సీఎంని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గువ్వల భరత్ కుమార్ తదితరులున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

# 'కుష్ఠు వ్యాధి సాధారణ చర్మ వ్యాధే'

**అఫ్జల్‌గంజ్:** కుష్ఠు వ్యాధి సాధారణ చర్మవ్యాధి మాత్రమేనని దీనికి శాశ్వత పరిష్కారం ఉందని, అపోహలు వీడాలని ఐఎడీవీఎల్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ వెంకటకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నెక్లెస్ రోడ్డులో సంఘం కార్యదర్శులు డాక్టర్ జేవీడీఎస్ ప్రసాద్, డాక్టర్ సహన, డాక్టర్ భూపేష్ కుమార్, డాక్టర్ పీఎస్. రావు, డాక్టర్ రమేష్, డాక్టర్ ఏజీ రావు, వైద్యులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్పర్శలేని తెల్లమచ్చలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. కుష్ఠు వ్యాధి శాపం కాదని, వంశపారంపర్యగా రాదని, ఇది ఒక లెప్రల్ అనే బ్యాక్టిరియా వల్ల వ్యాపిస్తుందని తెలిపారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అందరం కలిసి కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దామన్నారు.



# అవసరాలకు అనుగుణంగా ఆధునీకరణ పనులు

**కవాడిగూడ:** నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ తాళ్లబస్తీలో రూ.7 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, దోమలగూడ గగన్ మహల్ కాలనీలో రూ.7 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, దోమలగూడ మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేష్, బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సి మహేందర్ బాబు, ఎ.ప్రభాకర్, బీజేపీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, జలమండలి డీజీఎం కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

# బ్యాలెట్ పద్ధతి అమలు కోసం ధర్నా

**కవాడిగూడ:** దేశంలో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు నిర్వహించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద భారత ఎస్సీ, ఎస్టీ సంఘాల సమాఖ్య, సోషలిస్టు పార్టీ ఇండియా, పీపుల్స్ ప్రొటక్షన్ పార్టీ తదితర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో 'ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్లు ముద్దు' అంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఆనంద్ కుమార్, సోషలిస్టు పార్టీ ఇండియా తెలంగాణ అధ్యక్షురాలు సుభద్రారెడ్డి, భారత ఎస్సీ, ఎస్టీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ప్రసాద్ (రిటైర్డ్ ఐఏఎస్)లు మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం చట్టంలో తక్షణమే మార్పులు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈవీఎంలపై బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయని గుర్తుచేశారు. ఈవీఎంలను ఐఐటీ, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్లు పరీక్షించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది సదానందరెడ్డి, మహేశ్వర్ రాజుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

## పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుజాతారావు పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యకర్తల రివ్యూ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుజాతారావు మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ నాయకుల ఆస్తులు పెరిగాయి తప్ప ప్రజల అవసరాలు తీరలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు పుస్తకాల కవిత, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు శంబుల ఉషాశ్రీ, కోఆర్డినేటర్ నీలం పద్మ పాల్గొన్నారు.

## రేపటి నుంచి హరికథా మహోత్సవం

**నల్లకుంట:** విశ్రాంత ఐఏఎస్ కేవీ రమణాచారి 72వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హరికథా మహోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. మహోత్సవాల్లో మొదటి రోజు(గురువారం) సాయంత్రం 6 గంటలకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. దీనికి విశిష్ట అతిథిగా ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, గౌరవ అతిథిగా శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె.కృష్ణారావు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ భాగవతారిణి డాక్టర్ సప్పా భారతి భాగవతారిణిచే 'శివలీలలు' హరికథా గానం ఉంటుందన్నారు.

## 'యూజీసీ ప్రతిపాదనలు కుట్రపూరితం'



**కాచిగూడ:** రిజర్వేషన్లపై యూజీసీ ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా కేంద్ర విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు లేరన్న సాకుతో ఆయా ఖాళీలను డీరిజర్వ్ చేసి తిరిగి జనరల్ అభ్యర్థులచే భర్తీ చేయాలన్న యూజీసీ ప్రతిపాదనలు కుట్రపూరితమని ఆరోపించారు. రిజర్వేషన్‌లను రద్దు చేసేందుకే ఈ ప్రతిపాదన ముందుకొచ్చిందని ఆరోపించారు. ఈ ప్రతిపాదనని తక్షణమే వెనక్కి తీసుకోకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బీరం సతీశ్ కుమార్, సీహెచ్ శ్యామ్‌కుమార్, సుబ్బారావు, ఇటికాల గణేశ్, రవి, నక్కా దేవేందర్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాలను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్

**కాచిగూడ:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్, మోతీ మార్కెట్ ప్రాంతంలోని రహదారులను జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దని స్థానికులకు, వ్యాపారులకు సూచించారు. రోడ్లపై వ్యర్థాలు వేయకుండా.. చెత్త సేకరణ సిబ్బందికి చెత్త అందించాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్ఎఫ్ఏ అమరేశ్వరి, బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోశ్, ఎస్.రవియాదవ్ పాల్గొన్నారు.

## తుది ఫలితాలు విడుదల చేయాలి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేసిన అభ్యర్థులు

**కాచిగూడ:** టీఎస్‌పీఎస్సీలో ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పారా మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ (67/2017) నోటిఫికేషన్ తుది ఫలితాలు విడుదల చేయడంతో పాటు ఉద్యోగాలు భర్తీ చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఎస్సీ పారామెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ అభ్యర్థులు మాట్లాడుతూ.. 2017లో విడుదల చేసిన(67/2017) నోటిఫికేషన్‌కు సంబంధించి మెరిట్ జాబితా, సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేసి దాదాపు ఆరు నెలలు గడిచిపోయాయన్నారు. అయినా, నేటికీ సెలక్షన్ లిస్టు విడుదల చేయలేదని చెప్పారు. తమ సమస్యపై చైర్మన్ సానుకూలంగా స్పందించారని అభ్యర్థులు తెలిపారు.


## 'టీపీజేఎంఏ' అధ్యక్షుడిగా సతీశ్ గెలుపు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి గౌరీ సతీశ్ గెలుపొందగా.. ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికైయ్యారు. మొత్తం ఓట్లు 53 కాగా అందులో పోలైనవి 52. సమీప ప్రత్యర్థి జగదీశ్‌కు తొమ్మిది ఓట్లు రాగా గౌరీ సతీశ్ 40 ఓట్లు పోలైయ్యాయి. దీంతో 31 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు వరదారెడ్డి, డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, అప్సర్‌పాషా తెలిపారు. అనంతరం గౌరీ సతీశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీపీజేఎంఏ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకులకు సూచించారు. ఎన్ఎస్‌యూఐ నగర కార్యదర్శి సి.వినయ్‌కుమార్ మంగళవారం బట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

## వృద్ధుడి అదృశ్యం



వెంకటరామయ్య

**చిక్కడపల్లి:** వాకింగ్‌కు వెళ్లొచ్చి ఇంటి బయట కూర్చున్న వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పీఎస్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. హరినగర్‌కు చెందిన గోలి వెంకటరామయ్య(74) ఈ నెల 27న మధ్యాహ్నం ఇంట్లో వాళ్లతో కలసి భోజనం చేసిన తర్వాత వాకింగ్‌కి వెళ్లొచ్చి ఇంటి బయట కూర్చున్నాడు. అయితే, సాయంత్రం 5 గంటల నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.